ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 13.07.2026 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన 'సింగరేణి భరోసా యాత్ర'ను ఈ ఉదయం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రారంభించారు.
2. పిల్లల్లో నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఈరోజు కొనసాగుతోంది.
3. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కూడిన మంత్రుల బృందం ఈరోజు దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని సందర్శించింది.
4. రాష్ట్రంలో రాబోయే మూడు రోజుల పాటు అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలియజేసింది.

-----------------------------------

**సింగరేణి భరోసా యాత్ర**

బీజేపీ రాష్ట్ర కార్యాలయం నుంచి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావుతో కలిసి ఈ ఉదయం 'సింగరేణి భరోసా యాత్ర'ను ప్రారంభించారు. రెండు రోజుల పాటు ఈ పర్యటన కొనసాగనుంది. తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ కేటాయింపు నేపథ్యంలో, సుమారు 50 వేల మందికి పైగా సింగరేణి కార్మికులకు, 30 వేల మంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి భరోసా కల్పించడమే ఈ యాత్ర ముఖ్య ఉద్దేశం. హైదరాబాద్ నుండి బయలుదేరిన ఈ బృందంలో ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ తదితరులు ఉన్నారు. కాగా, ఈరోజు ఖమ్మం, కొత్తగూడెంలో యాత్రకు

ఘన స్వాగతం లభించింది. కొత్తగూడెం క్లబ్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ...

**బైట్ - కిషన్ రెడ్డి**

సింగరేణి భరోసా యాత్ర మణుగూరు, భూపాలపల్లి, తాడిచర్ల, రామగుండం, మంచిర్యాల ప్రాంతాల్లో సాగనుంది.

**పీటీసీ – భద్రాద్రి కొత్తగూడెం**

-------------------------------------------

**నులిపురుగులు**

రాష్ట్రవ్యాప్తంగా పిల్లల్లో నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హైదరాబాద్ రాజ్‌భవన్ ప్రభుత్వ పాఠశాలలో ఈ ఉదయం ప్రారంభించారు. 1 నుంచి 19 సంవత్సరాల వయస్సున్న పిల్లలందరికీ ఈ మాత్ర తప్పనిసరిగా వేయించాలని ఆయన తల్లిదండ్రులను కోరారు. నులిపురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం ఏర్పడి ఎదుగుదల మందగిస్తుందని, చదువుపై శ్రద్ధ తగ్గుతుందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మాత్రల వల్ల పిల్లల్లో రోగనిరోధక శక్తి, చదువుపై ఏకాగ్రత పెరుగుతాయని ఆయన వివరించారు. విద్యా, మహిళా-శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో జరుగుతున్న ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 96 లక్షల 81 వేల మందికి పైగా చిన్నారులకు మాత్రలు అందజేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ పంపిణీ జరుగుతోంది. ఈరోజు మాత్ర వేసుకోలేకపోయిన పిల్లల కోసం జూలై 20న ప్రత్యేకంగా 'మాప్-అప్' కార్యక్రమం నిర్వహిస్తామని మంత్రి తెలిపారు.

**పీటీసీ - హైదరాబాద్**

-----------------------------------

**దేవాదుల పర్యటన**

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కూడిన మంత్రుల బృందం ఈరోజు దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని సందర్శించింది. హెలిప్యాడ్ వద్ద మంత్రుల బృందానికి జిల్లా కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ లెనిన్ వస్సల్ టోప్పో, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రులు దేవాదుల ప్రాజెక్టును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గోదావరి నది నుంచి వస్తున్న వరద ప్రవాహం, ప్రాజెక్టులో ప్రస్తుత నీటి నిల్వ సామర్థ్యంతో పాటు నీటి పంపింగ్‌కు సంబంధించిన తాజా వివరాలను ఇరిగేషన్ అధికారులు మంత్రుల బృందానికి మ్యాప్‌ల ద్వారా వివరించారు.

డెస్క్

----------------------------

**తుమ్మల**

రాష్ట్రంలో ఎల్-నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు వ్యవసాయ శాఖ సిద్ధం చేసిన మూడు అత్యవసర కార్యాచరణ ప్రణాళికలపై వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇక్రిశాట్‌లో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాల ప్రతినిధులతో పాటు, ICRISAT, ఐఐఓఆర్, ఐఐఎంఆర్, క్రిడా సంస్థల శాస్త్రవేత్తలు, భారత వాతావరణ శాఖ అధికారులు, వ్యవసాయ అనుబంధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

డెస్క్

-----------------------------------

**ప్రారంభం**

హైదరాబాద్ లోని సనత్‌నగర్ ఈఎస్ఐసీ ఆసుపత్రి నుంచి దేశవ్యాప్తంగా 668 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన 7 ఈఎస్ఐసీ ఆరోగ్య ప్రాజెక్టులను కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయ రేపు ప్రారంభించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా సనత్‌నగర్ ఈఎస్ఐసీ ఆసుపత్రిలోని కొత్త ఓపీడీ విభాగాన్ని ఆయన స్వయంగా ప్రారంభించనుండగా, మిగిలిన 6 ప్రాజెక్టులను ఆన్‌లైన్

ద్వారా ప్రారంభిస్తారు. ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్రవరం, అస్సాంలోని బెల్తోలా, తమిళనాడులోని శ్రీపెరంబుదూర్ ఆసుపత్రులతో పాటు గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల్లోని పలు ఈఎస్ఐ డిస్పెన్సరీలను ఈ సందర్భంగా జాతికి అంకితం చేయనున్నారు.

డెస్క్

--------------------------------

రక్తదానం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా బిఆర్ఎస్వీ, బిఆర్ఎస్ యువజన విభాగం ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో వినూత్నంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, సంజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ప్రారంభించారు

డెస్క్

-------------------------------------

**గవర్నర్**

హైదరాబాద్ ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో నిన్న రాత్రి జరిగిన 'టీజీ20 సీజన్–1' ఫైనల్ మ్యాచ్, ముగింపు వేడుకకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ పోరులో ఖమ్మం ఏసెస్ జట్టుపై హైదరాబాద్ ఈ-ఛాంపియన్స్ ఘన విజయం సాధించి, తొలి సీజన్ ఛాంపియన్‌గా నిలిచింది. ఈ మ్యాచ్‌ను గవర్నర్, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లుతో కలిసి వీక్షించారు.

డెస్క్

---------------------------

**టెట్**

తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (TG TET) ఫలితాలు ఈ మధ్యాహ్నం విడుదలవుతాయి. అభ్యర్థులు తమ హాల్ టికెట్ నంబర్ ఉపయోగించి ఫలితాలను, స్కోర్ కార్డులను డౌన్‌లోడ్

చేసుకోవచ్చు. అధికారిక వెబ్‌సైట్ TG TET లేదా పాఠశాల విద్యాశాఖ పోర్టల్‌లో ఫలితాలు తెలుసుకోవచ్చు.

**పీటీసీ - హైదరాబాద్**

----------------------------------

**ఆది నులి**

ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, అందుకోసమే ఏటా రెండుసార్లు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేస్తున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పంపిణీ కార్యక్రమాన్ని, వేములవాడ ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ..

**బైట్ - ఆది శ్రీనివాస్**

**పీటీసీ - సిరిసిల్ల**

------------------------------

**మాత్రలు**

హన్మకొండ జిల్లా వ్యాప్తంగా 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. హనుమకొండలోని  మర్కజి ప్రభుత్వ పాఠశాలలో జిల్లా కలెక్టర్  చాహత్ బాజ్ పాయ్ ప్రారంభించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మొత్తం 2లక్షల 8వేల 441 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

**పీటీసీ - హన్మకొండ**

-------------------------------

**నులిపురుగులు జగిత్యాల**

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా అర్హులైన విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నట్లు జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్

శ్రీనివాస్ తెలిపారు. బాలబాలికలందరూ తప్పనిసరిగా ఈ మాత్ర తీసుకోవాలని ఆయన సూచించారు.

**బైట్ – డాక్టర్ శ్రీనివాస్**

**పీటీసీ - జగిత్యాల**

------------------------------

**వాతావరణం**

రాష్ట్రంలో రాబోయే మూడు రోజుల పాటు అక్కడక్కడ తేలికపాటి వర్షాలు లేదా చెదురుమదురు జల్లులు కురిసే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలియజేసింది. ఉత్తర, ఈశాన్య, మధ్య, దక్షిణ తెలంగాణ ప్రాంతాల్లో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని వెల్లడించింది.

**పీఎస్**

-------------------------------

**గిరి ప్రదక్షిణ**

అమావాస్య సందర్భంగా రేపు నల్లగొండ జిల్లా చెరువుగట్టు లోని శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నామని విశ్వహిందూ పరిషత్ ప్రతినిధి ఉండ్యాల ప్రకాష్ రెడ్డి తెలిపారు.

**పీటీసీ - నల్గొండ**

----------------------------

**వేములవాడ**

మాస శివరాత్రి పురస్కరించుకొని రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో నిన్న రాత్రి మహా లింగార్చన కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు, వేద పండి తులు ఘనంగా నిర్వహించారు. 365 చిన్న ప్రమిదలను తయారు చేసి భక్తిశ్రద్ధలతో జ్యోతులు వెలిగించారు.

**పీటీసీ – సిరిసిల్ల**

------------------------------------

**సూర్యాపేట ఎస్ఐఆర్**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలని సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ బి. హరిసింగ్ అధికారులను ఆదేశించారు. సర్వే గడువు సమీపిస్తున్నందున ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆయన సూచించారు.

**పీటీసీ - సూర్యాపేట**

------------------------------

**పీసీసీ చీఫ్**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కుటుంబ సమేతంగా ఈరోజు మంచిరేవులలోని శ్రీ మచిలేశ్వర స్వామి – వీరభద్ర స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో విలసిల్లాలని, తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింతగా అభివృద్ధి సాధించాలని స్వామివార్లను ప్రార్థించినట్లు తెలిపారు.

**డెస్క్**

----------------------------------

**కలెక్టర్ తనిఖీ**

నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ చారకొండ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని, ఇందిరమ్మ ఇళ్ల పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... కేజీబీవీ పాఠశాల విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచడంతో పాటు విద్యార్థినులకు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలు నాణ్యతతో అందేలా చర్యలు తీసుకోవాలని  ఉపాధ్యాయులను ఆదేశించారు.

**పీటీసీ - నాగర్ కర్నూల్**

----------------------------------

**ప్రజావాణి**

ప్రజావాణి లో దరఖాస్తుదారులు నిలబడి నిరిక్షిస్తున్నారని ఈ రోజు నుంచి నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్ర అధికారులతో సమానంగా దరఖాస్తు దారులకు సీట్లను కేటాయించారు. దీంతో ప్రజావాణి కి వచ్చిన ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు

**పీటీసీ - నిర్మల్**

-------------------------------------